క్లుప్తంగా

ఎస్‌ఐగా మోహనరావు బాధ్యతల స్వీకరణ



రెడ్డిగూడెం(మైలవరం): మైలవరం నియోజక వర్గం రెడ్డిగూడెం మండల ఎస్‌ఐగా బి. మోహనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏలూరు ఏజెన్సీలో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించారు. బదిలీపై రెడ్డిగూడెం వచ్చారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడటానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

మీకోసం అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ వై భవానీశంకరి ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమంలో ఆర్డీఓ డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన ప్రజల నుంచి నుంచి అర్జీలను స్వీకరించారు. 14 అర్జీలు రాగా వాటన్నింటికీ రసీదులను అర్జీదారులకు అందజేశామని ఆర్డీఓ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అర్జీలు పంపిస్తామని, వీటి పరిష్కరించడంలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తారని, దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చని తెలిపారు. పరిష్కారానికి వీలుకాకపోతే సంబంధిత కారణాన్ని చూపించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగేశ్వరి, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెమలి వేణుగోపాలస్వామి ఆలయం సంప్రోక్షణ

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం సంప్రోక్షణను సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు అర్చక బృందంచే శాస్త్రోక్తంగా ప్రత్యేక కార్యక్రమాలను జరిపారు. ఆలయాన్ని పూర్తిగా పరిశుభ్రం చేశారు. ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి నిలిపివేసిన స్వామి దర్శనాన్ని మధ్యాహ్నం 11గంటల తర్వాత పునరుద్ధరించారు. ఆలయంలో యేడాదికి ఒక రోజు ఈసంప్రోక్షణ నిర్వహిస్తారు. యేడాదిలో జరిగిన పూజలు, ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తుల నడవడికలో ఏమైనా తప్పులు, పొరబాట్లు ఉంటే క్షమించమని కోరుతూ సంప్రోక్షణ జరుపుతారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తిరువూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర సహకారశాఖామంత్రి అచ్చన్నాయుడును మంగళగిరిలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం తెలిపారు. సహకార సంఘాల రికార్డుల కంప్యూటరైజేషన్, ఆధార్ సీడింగ్ ప్రక్రియలో జరుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, సొసైటీ ఉద్యోగులపై అదనపు పనిభారం తగ్గించాలని, సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియలో ఉన్నతాధికారులు పరుష పదజాలంతో ఉద్యోగులను దూషిస్తున్న సంఘటనలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.

అధికారులకు సన్మానం



రెడ్డిగూడెం(మైలవరం): మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సుశీలాదేవి, ఎంపీడీవో హరిప్రసాద్‌లను ఎస్టీయూ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు జి.అనుగ్రహ ప్రసాద్, బి.అనిల్ కుమార్, వై.మోహనకృష్ణ, నాగరాజు, ప్రేమ్, శ్రీనివాసరావు, కుమార్, శంకర్, శిరీష, భవాని తదితరులు పాల్గొన్నారు.

కనులవిందుగా నంద దీపోత్సవం

గంపలగూడెం: స్థానిక షిర్డీసాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి నంద దీపోత్సవం కనులవిందుగా జరిపారు. బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు మోసుకొంటూ నందదీపాలతో మందిరం చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు. అనంతరం బాబాకు విశేష పూజ, హారతి ఇచ్చారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో రాఖీ పండుగ



చాట్రాయిలో రాఖీ షాపు వద్ద రాఖీలు కొంటున్న ఆడపడుచులు



నూజివీడు త్రివిధ స్కూల్‌లో రాఖీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరువూరు: సోదరభావానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని తిరువూరు శ్రీనిధి పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ అన్నారు. సోమ వారం పాఠశాలలో రాఖీలు కట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరూ తప్పక జరుపుకోవాలని వెంకటనారాయణ సూచించారు. పలు దేవాలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

మైలవరం: ప్రతి మనిషి సోదర భావం పెంపొందించుకోవాలని హెచ్‌ఎం ఉడతా లక్ష్మీనారాయణ తెలిపారు. మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో విద్యార్థులకు రక్షాబంధన్ (రాఖీలు) కట్టి మిఠాయిలు తినిపించారు. పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు. మైలవరంలో రక్షాబంధన్ పండుగను ఘనంగా నిర్వహించారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వాదం పొందారు.

విస్సన్నపేట: రాఖీ పౌర్ణమి వేడుకలను మండలంలో నిర్వహించారు. సోదరీమణులు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి ఆశీస్సులు పొందారు. మండలంలో రాఖీపౌర్ణమి వేడులను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు.

నూజివీడు: స్థానిక త్రివిధ హైస్కూల్‌లో సోమవారం రాఖీ వేడుకలు నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ మట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు.



తిరువూరులో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో హెచ్‌ఎంకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

చాట్రాయి: అన్నా చెల్లి, అక్కా తమ్ముళ్ల అనురాగాలకు అతీతంగా జరుపుకునే రాఖీ పండుగను సోమవారంఘనంగా నిర్వహించారు. రాఖీ షాపులు, స్వీట్లు, పండ్ల దుకాణాలు కిటకిటలాడా యి. ఆటోలు,ద్విచక్రవాహనాలపై ఆడపడుచులు పుట్టింటికి వచ్చి అన్నకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టారు.

గంపలగూడెం: రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య అనురాగం ఆప్యాయతలను పంచుతూ సోదరులకు, సోదరీమణులు రాఖీలు కట్టి అండగా నిలవాని ఆశీర్వాదం తీసుకొన్నారు. తమ తోబుట్టువులకు సోదరులు పసుపు కుంకుమాకాలను అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం అక్కచెల్లెల్లు సోదరుల ఇళ్లకు వచ్చారు.



సోదరులకు రాఖీలు కడుతున్న ఎంపీపీ కొండా దుర్గాభవాని

ముసునూరు: మండలంలో పలువురు మహిళలు, యువతులు, బాలికలు తమ సోదరుల ఇళ్లకు తరలి వెళ్లి రాఖీలు కట్టారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని హనుమాన్ జంక్షన్‌లోని తన అన్న, తమ్ముడు వద్దకు తరలివెళ్లి, ఇరువురికి ఏక కాలంలో రాఖీలు కట్టి, వారి నుంచి అభయాన్ని పొందారు.

లోపల వీడియో కాన్ఫరెన్స్.. బయట సిబ్బంది

నూజివీడు: చాలీచాలని గదుల్లో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఏర్పాటు చేయగా, అది సరిపోక గ్రామ సచివాలయ సిబ్బంది బయటే ఉండాల్సిన పరిస్థితి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నెలకొంది. ఉపాధి హామీ పథకం పనులపై డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. దీనికి నూజివీడు, ముసునూరు మండలాలకు చెందిన పలు శాఖల అధికారులతో పాటు గ్రామ సచివాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. అయితే నూజివీడు ఎంపీడీఓ కార్యాలయంలో స్థలాభావం వల్ల దాదాపు సగం మంది వీడియో కాన్ఫరెన్స్‌కు దూరంగా కార్యాలయం బయటే ఉండిపోవాల్సి వచ్చింది. సరైన ఏర్పాట్లు చేయకుండా వారందరిని వీడియో కాన్ఫరెన్స్‌కు ఎందుకు రమ్మన్నారో అధికారులకే తెలియాలి. దీంతో సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ జరిగినంత సేపూ ముచ్చట్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశపు హాలులో ఏర్పాటు చేసుకున్నా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే వాళ్లమని సిబ్బందే పేర్కొనడం గమనర్హం.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆరుబయట కూర్చున్న గ్రామ సచివాలయ సిబ్బంది

బార్‌లో మందుబాబుల వీరంగం

ఇబ్రహీంపట్నం: ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మందుబాబులు వీరంగం సృష్టించారు. స్థానిక రింగ్‌సెంటర్ సమీపంలోని బార్‌లో ఆదివారం రాత్రి మందుబాబులు మద్యం మత్తులో రెచ్చిపోయి ఖాళీ మద్యం బాటిళ్లతో దాడి చేసుకున్నారు. దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉన్నట్టుండి ఖాళీ సీసాలు పగిలిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో మిగిలిన వారు భయాందోళనకు గురయ్యారు. బార్ సిబ్బంది గొడవ పడిన వారిని బయటకు నెట్టేయడంతో రోడ్డుపై కొద్దిసేపు వీరంగం సృష్టించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అల్లర్లకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇబ్రహీంపట్నంలోని ఓ బార్‌లో మద్యం మత్తులో దాడి చేసుకుంటున్న మందుబాబులు

25 మందికి దంత వైద్య పరీక్షలు

పెనుగొలను (గంపలగూడెం): ప్రతి ఒక్కరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవడం ద్వారా దంత సమస్యలు రాకుండా చూసుకోవాలని దంతవైద్యులు బండి నరశింహారావు సూచించారు. మండలంలోని పెనుగొలనులో సోమవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఆహారం తీసుకోవడానికి ముందు, తర్వాత నీటితో పుక్కిలించి శుభ్రపరుకోవాలన్నారు. లేకుంటే కొన్ని పదార్థాలు పళ్లమధ్య నిలిచిపోయి ఇతర సమస్యలకు దారితీస్తాయన్నారు. బ్రష్‌లను కూడా నిర్ణీత కాలం మాత్రమే ఉపయోగించాలన్నారు. శిబిరంలో 25 మందికి దంత పరీక్షలు చేసి తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. నిర్వాహకులు ఆసెసీ సేవాసదన్ సభ్యులు ఆర్.మురళి తగిన ఏర్పాట్లు చేశారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

అంకిత భావంతో పనిచేసిన 'చిలుకూరి'

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు

విస్సన్నపేట: అంకిత భావంతో ఉపాధ్యాయుడుగా పని చేసి అందరి మన్ననలు పొంది ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన వ్యక్తి చిలుకూరి దామోదరరెడ్డి అని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు అన్నారు. విస్సన్నపేటకు చెందిన చిలుకూరి దామోదరరెడ్డి చాట్రాయి మండలం చిత్తపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆయన నివాసం వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో స్వామిదాసు పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, విస్సన్నపేట, ఎ.కొండూరు జెడ్పీటీసీ సభ్యులు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, భూక్యా గనియా, పార్టీ నాయకులు నరెడ్ల వీరారెడ్డి, అల్లు గణపతిరెడ్డి, కాసర చెన్నారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, గ్రామ ప్రముఖులు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.

టీడీపీ నేతలపై కులదూషణ కేసు నమోదు

తిరువూరు: మండలంలోని పెద్దవరంలో దళితయువకుడ్ని కులంపేరుతో దూషించిన తెలుగుదేశం నాయకులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పెద్దవరం మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యత్వం కోరుతూ గ్రామానికి చెందిన పల్లెకంటి యువరాజు (డేవిడ్) మరికొందరు దరఖాస్తు చేయగా, వారికి సభ్యత్వం ఇవ్వడానికి పాలకవర్గం నిరాకరించింది. తనను సొసైటీ బాధ్యులు గద్దె కృష్ణయ్య, తాళ్ళూరి వెంకటేశ్వరరావు తదితరులు కులం పేరుతో దూషించినట్లు డేవిడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 11 మందిపై కుల దూషణ కేసు నమోదు చేశామని సహాయ పోలీస్ కమిషనర్ మురళీమోహన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యత్వం కోసం డేవిడ్‌రాజు దరఖాస్తు చేయడంతో పాటు సభ్యత్వం కలిపించకపోతే కేసులు పెడతానని బెదిరించాడని గద్దె కృష్ణయ్య తదితరులు ఇచ్చిన ఫిర్యాదును కూడా స్వీకరించి కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. సోమవారం పెద్దవరంలో డేవిడ్‌రాజు తదితరుల వాంగ్మూలాలను నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

చాట్రాయి: రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కౌలు రైతులు, రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు.



వేంకటాచలస్వామికి గరుడసేవ



తిరువూరు: స్థానిక పాతతిరువూరులోని శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం గరుడ వాహనసేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై ఊరేగించారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు, మహిళా భక్తులు పూజాదికాల్లో పాల్గొన్నారు.

14వ పర్యాయం ఆంజనేయ స్వామి గుడికి పాదయాత్ర



మేడూరు(గంపలగూడెం): వీరాంజనేయస్వామి భక్తమండలి ఆధ్వర్యంలో గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వరకు భక్తులు పాదయాత్ర సోమవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆంజేయస్వామి జెండాలను చేతబూని, జైశ్రీరామ్, జైహనుమాన్ అంటూ స్వామిని స్మరిస్తూ పెద్దసంఖ్యలో భక్తులు ఆరు కిలోమీటర్ల దూరం కాలినడకన ఆలయవద్దకు చేరుకొన్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. 108 పాదయాత్రల్లో భాగంగా 14వ పర్యాయం పౌర్ణమి సందర్భంగా కాలినడకన వీరాంజనేయస్వామి ఆలయంకు వెళ్లినట్లు ఆంజేయస్వామి భక్తమండలి సభ్యులు తెలిపారు.

తిరుమల తిరుపతి రక్షా బంధనాల ధారణ

ముసునూరు: నీవు నాకు, నేను నీకు రక్ష – మనమంతా దేశ ధర్మానికి రక్ష అంటూ ధార్మిక మహిళలు రక్షాబంధనాలను ధరించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో టీటీడీ నుంచి సూరేపల్లి రప్పించిన రాఖీలను సోమవారం భక్తిశ్రద్ధలతో ధార్మిక మహిళలు ధరించారు. మనమంతా దేశానికి ధార్మిక రక్ష అంటూ జపం చేస్తూ రక్షాబంధనాలను ధరించారు.

నియోజకవర్గాభివృద్ధికి కలిసి పనిచేద్దాం

ఎంపీ, ఎమ్మెల్యే

అనంతవరం(మైలవరం): మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి విజ్ఞప్తి చేశారు. మైలవరం మండలం అనంతవరం గ్రామంలో పాల కేంద్రం నూతన భవనాన్ని ఎంపీ కేశినేని చిన్నితో కలిసి సోమవారం ప్రారంభించారు. రాజధానికి దగ్గరగా ఉన్న మైలవరం నియోజకవర్గానికి ప్రాధాన్యమిస్తూ కేంద్రం నుంచి అదనంగా నిధులు మంజూరు చేయించాలని, దీనికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతవరం గ్రామంలో రూ.4.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పాలకేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని జి.కొండూరు మండలం సున్నంపాడు, మునగపాడు గ్రామాల మధ్య గత ప్రభుత్వం సేకరించిన సుమారు 270 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉందని, ఈ భూమిని తాజాగా పరిశ్రమల కోసం కేటాయించినట్లయితే స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. విజయవాడ ప్రాంత వాసుల ఇళ్ల స్థలాలకు జక్కంపూడి శివారు ప్రాంతంలో సుమారు 50 ఎకరాలు భూమి కేటాయించి టిడ్కో ఇళ్ల మాదిరి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టి పేదలకు ఇస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యపై మంత్రి నారా లోకేష్‌తో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



పాలకేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

డైవర్షన్ రహదారి మరమ్మతులు పూర్తి

16 రోజుల తర్వాత వాహనాల రాకపోకలు ప్రారంభం

కట్టలేరు(గంపలగూడెం): మండలంలోని ప్రధాన నీటివనరై కట్టలేరుపై పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలు సోమవారం నుంచి ప్రారంభించారు. ఏటిలో వరద ఉధృతి కారణంగా గడచిన 16 రోజులుగా ఏటిపై రాకపోకలు జరుగలేదు. మండలంలోని తోటమూల–వినగడప మధ్య కట్టలేరుపై ధ్వంసమైన వంతెన పక్కన నిర్మించిన మళ్లింపు రహదారి ఏటిలో ప్రవాహ ఉధృతి కారణంగా మునిగిపోవడంతో రాకపోకలు జరిపే అవకాశం లేక నిలిపివేశారు. నాల్గురోజుల క్రితం ఏటిలో వరద ఉధృతి తగ్గినప్పటికీ నీటివేగానికి డైవర్షన్ రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో గత శనివారం నుంచి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. వరదనీరు సక్రమంగా దిగువకు పారేందుకు గతంలో ఉన్న 12 వరుసల బొంగులకు తోడు మరో ఐదు వరసల బొంగుల్ని డైవర్షన్ రహదారి కింద ఏర్పాటు చేసి గ్రావెల్ పరిచారు. దీంతో పూర్తిస్థాయిలో రాకపోకలు సౌకర్యం కలిగింది. రెండు వారాలుగా నిలిచిపోయిన రాకపోకలు పునర్దణతో ఏటి అవతల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకొనే అవకాశం ఏర్పడంతో ఇబ్బందులు తొలిగాయి.



మరమ్మతులుపూర్తయిన మళ్లింపు రహదారి

కొండపల్లిలో ట్రాఫిక్ జామ్

కొండపల్లి(ఇబ్రహీంట్నం): కొండపల్లి శాంతినగర్ వద్ద 30వ నంబర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక ఎర్రకట్ట రైల్వే బ్రిడ్జి వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం రాత్రి సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనాలు నిలిచిపోయాయి. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల నుంచి సాయంత్రం సమయంలో కళాశాలల విద్యార్థులు బస్సుల్లో ఇళ్లకు చేరుకునే సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో పలువురు విద్యార్థులు, వివిధ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



కొండపల్లి శాంతినగర్ వద్ద హైవేపై నిలిచిన వాహనాలు

గొర్రెలు, మేకలకు టీకాలు

ఆగిరిపల్లి: గొర్రెలు, మేకలు పెంపకం దారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నగిరిపల్లి గొల్లగూడెంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల అవగాహన కార్యక్రమంలో గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గొర్రెల పెంపకం వ్యవసాయ అనుబంధమైనవని, వారిని చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో నూజివీడు నియోజకవర్గంలో మూడు కోట్ల రూపాయలను గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘాలకు రుణాలుగా అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గొర్రెలు, మేకలు పెంపకానికి షెడ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూ బాబు, డెప్యూటీ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్, గొర్రెల మేకల పెంపకం దారుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకటకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్ బహిష్కరణ

ఇబ్రహీంపట్నం: తాత్కాలిక సర్దుబాటు కౌన్సెలింగ్ ప్రక్రియను ఇబ్రహీంపట్నంలో సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బహిష్కరించారు. ఎంఈవో కార్యాలయం వద్ద తప్పుల తడకలతో ఉన్న సీనియార్టీ లిస్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సర్దుబాటు మండల స్థాయిలో జరపాలన్నారు. 98 మంది కంటే తక్కువ విద్యార్థులు కలిగిన ఎంపీయూపీ పాఠశాలల్లో ఐదు ఎస్‌జీటీ పోస్టులు కేటాయించాలన్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండో టీచర్ పోస్ట్ కేటాయించాలని కోరారు. జెడ్పీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు యథావిధిగా కొనసాగించాలని ఎంఈవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఖాశిం, నాయకులు అమర్‌నాయక్, ఆర్మ్‌స్ట్రాంగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోలాహలంగా గిరి ప్రదక్షిణ

మెట్టగుట్ట(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి సన్నిధిన భక్తులు సోమవారం కోలాహలంగా గిరిప్రదక్షిణ జరిపారు. ముందుగా ఆలయంలో యోగానందచార్యులు, శ్యామసుందరాచార్యులు వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసస్వామి ఉత్సవమూర్తిని అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు మోసుకోంటూ గోవింద నామాలు పల్కుతూ గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం రాఖీపౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ పంది వెంకట్రావ్, యనమద్ది విజయ్ కుమార్, కోట నాగేశ్వరరావు (బాబు), నాగళ్ళ మురళీ తదితరులు పాల్గొన్నారు.

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో కలగర రోడ్డులో ఉన్న ఒక కోళ్లఫారంలో నిల్వ ఉంచిన తెలంగాణకు చెందిన 19 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని సివిల్ సప్లయిస్ డీటీ శివనాగరాజు సోమవారం తెలిపారు. ఎస్‌ఐ రామ కృష్ణకు వచ్చిన సమాచారం మేరకు రేషన్ బియ్యంను పట్టుకున్నామని డీటీ తెలిపారు. పట్టుబడిన రేషన్‌బియ్యాన్ని స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేశామన్నారు.

కృత్రిమ కాళ్లు పంపిణీ

ఆగిరిపల్లి: దివ్యాంగులకు దాతలు తోడ్పాటు అందించాలని హీల్ సంస్థ డైరెక్టర్ టి.భాస్కర్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో నందిగామకు చెందిన గరికిపాటి రాజేశ్వరికి కృత్రిమ కాళ్లను అందజేశారు. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, జ్ఞాపకార్థం పురస్కరించుకుని దాతలు దివ్యాంగులకు వారి జీవితంలో పునర్జీవనం కలిగించవచ్చని భాస్కర్ అన్నారు. కృత్రిమ కాళ్లు వితరణ చేయాలనుకునేవారు ఫోన్ నంబర్ 93983 88612లో హీల్ సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, కార్యదర్శి తాతినేని లక్ష్మీ, టెక్నీషియన్ చిన్నా, హీల్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: పోలవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో చెత్త కుప్పలు, మురుగు నీరు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మీ, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.